



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 14-06-2022 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 228 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## మరింత పారదర్శకంగా ఆరోగ్య శ్రీ పథకం

- ఆరోగ్య ఆసరా కింద తల్లికి రూ.5వేలు
- క్యాన్సర్ కేర్‌పై ప్రభుత్వం దృష్టి..
- వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అమరావతి (విజయభాను న్యూస్) : వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులు, ఆరోగ్యశ్రీ, దాని కింద కార్యక్రమాలు, వైద్య ఆరోగ్యశాఖలో నాడు- నేడు కింద చేపడుతున్న పనులు, కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, క్యాన్సర్ కేర్ తదితర అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏ తరహా ప్రసవం జరిగినా తల్లికి రూ.5వేలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

- ఆరోగ్య ఆసరా కింద తల్లికి రూ.5వేలు.
- సహజ ప్రసవం జరిగినా, సిజేరియన్ జరిగినా రూ.5వేలు.
- గతంలో సిజేరియన్ జరిగితే రూ.3వేలు కాగా, దీన్ని రూ.5వేలకు పెంచాలి.
- సహజ ప్రసవం అయినా, సిజేరియన్ అయినా తల్లీబిడ్డల సంరక్షణ ముఖ్యం కాబట్టి, ఒకే మొత్తాన్ని ఇవ్వాలి.
- సహజ ప్రసవాలను పెంచడంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి.
- సహజ ప్రసవంపై అవగాహన, చైతన్యం నింపాల్సిన బాధ్యత వైద్యులదే.

**ఆరోగ్య శ్రీ పరిధిలోకి మరిన్ని వైద్య చికిత్సలు..**

సమీక్ష సందర్భంగా ఆరోగ్యశ్రీ కింద అందుతున్న వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చును అధికారులు వివరించారు. ఆరోగ్యశ్రీలో 2,446 ప్రొసీజర్లు కవర్ అవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో దీనిపై నిరంతర అధ్యయనం చేయాలని, అవసరాల మేరకు మరింత మంచి చేయడానికి ప్రొసీజర్ల సంఖ్యను పెంచాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. కాగా, ఇప్పటికే దీనికి సంబంధించిన కసరత్తు ప్రారంభించామని అధికారులు తెలిపారు. వైద్యులు, వైద్య సంఘాలతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో వారం రోజుల్లో దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్.. అధికారులను ఆదేశించారు.

- ఆరోగ్య శ్రీ కింద కనీసంగా రూ.270 కోట్లు.
- 104,108 కోసం నెలకు కనీసంగా రూ.25 కోట్లు.

ఆరోగ్య ఆసరా కింద నెలకు కనీసంగా రూ.35 కోట్లు. కేవలం ఆరోగ్యశ్రీ, దానికింద కార్యకలాపాల కోసం ఏడాదికి

తరువాయి 2లో..


### ప్రభుత్వ సలహాదారు
## సజ్జల పదవీకాలం పొడిగింపు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పదవీ కాలం ఏడాదిపాటు పొడిగించింది ప్రభుత్వం. సజ్జలతో పాటు ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్)గా ఉన్న జీవీడీ కృష్ణ మోహన్ పదవి కాలాన్ని మరో ఏడాది పొడిగించారు. అంతేకాదు ముఖ్యమంత్రి ప్రిన్సిపాల్ అడ్వైజర్ అజయ్ కల్లం, ప్రభుత్వ సలహాదారు శామ్యూల్ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ ప్రభుత్వం.

### (ఏపీపీఎస్సీ) నచ్చిన వారిని ఎంపిక చేసేందుకు
## నిబంధనల ఉల్లంఘన

### జగన్‌కు చంద్రబాబు లేఖ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ల జారీలో జాప్యం, గ్రూప్-1 ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపికలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తెదేపా అధినేత చంద్రబాబు కోరారు. ఈ మేరకు సీఎం జగన్‌కు చంద్రబాబు లేఖ రాశారు. నిరుద్యోగ యువత కలలు, లక్ష్యాలను సాకారం చేయాల్సిన ఏపీపీఎస్సీ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. ప్రతి ఏడాది జనవరిలో క్రమం

## ఆంధ్రప్రదేశ్‌లో భాజపా బలంగా ఉంది

- ఏపీలో భాజపాను వ్యతిరేకించే పరిస్థితి లేదు
- జాతీయ అంశాలపై కేసీఆర్ కసరత్తు
- ఏపీలో వైకాపా, తెదేపా, జనసేన.. అన్ని పార్టీలు భాజపాకే మద్దతు
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



రాజమండ్రి: కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటిసారి ఆయన్ను కలిశానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. నిన్న మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేసీఆర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. అయితే పార్టీ ఏర్పాటు గురించి వారి మధ్య ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. భేటీలో భాజపా గురించి పలు అంశాలపై చర్చించామని.. ఆ పార్టీపై ఇద్దరికీ ఒకే రకమైన అభిప్రాయాలు ఉన్నాయని చెప్పారు. రాజమహేంద్రవరంలో ఉండవల్లి మీడియాతోమాట్లాడుతూ.."ఆంధ్రప్రదేశ్‌లో భాజపా బలంగా ఉంది. ఏపీలో ఏ పార్టీ ఎంపీ సీట్లు గెలిచినా.. అవి భాజపావే. భాజపాకు ఏపీలో ఉన్న బలం మరో రాష్ట్రంలో లేదు. ఏపీలో వైకాపా, తెదేపా,

తరువాయి 4లో..

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం మరియు పలు అంశాల పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎల్.ఎ కాలపరిమితి దాటి విజ్ఞప్తులు పెండింగు లేకుండా సత్వరమే వాటిని పరిష్కరించాల్నారు. అదే విధంగా పిటిషన్లు రి ఓపెన్ కారాదని అందుకు అధికారులు సంతృప్తి కరమైన పరిష్కారాన్ని అందించి తెలియజేయాలన్నారు. సచివాలయం మహిళా పోలీస్ ఉద్యోగులకు ప్రొబేషన్ పూర్తి చేసిన వివరాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బదిలీలకు సంబంధించి విభాగాధిపతులు తగు చర్యలు తీసుకోవాలని, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఏ. పీ. సేవ పోర్టల్ ద్వారా సచివాలయంలో వినతులు స్వీకరించాలని అన్నారు. వారం రోజుల్లో కొన్ని సచివాలయాల్లో చాలా తక్కువ అప్లికేషన్స్ వస్తున్నాయి అని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఒక్క అప్లికేషన్ కూడా స్వీకరించని

తరువాయి 8లో..

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలో సోమవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న ఓ ప్లాస్టిక్ గోదాములో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు గోదాం అంతటా వ్యాపించాయి. దీంతో స్థానికులు అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. ఈ గోదాం చుట్టుపక్కల నివాసాలు ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.. కానీ భారీగా ఆస్తి నష్టం సంభవించింది.






## రాహుల్‌ను 3 గంటల పాటు ప్రశ్నించిన ఈడీ



దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం ఈడీ విచారణను ఎదుర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు సంస్థ ఆయన్ను మూడు గంటల పాటు ప్రశ్నించింది. అనంతరం సోదరి ప్రియాంక గాంధీతో కలిసి, కార్యాలయం వద్ద నుంచి వెళ్లిపోయారు. తర్వాత పార్టీ అధినేత్రి సోనియా గాంధీ చికిత్స పొందుతోన్న సర్ గంగరామ్ ఆసుపత్రికి చేరుకున్నారు. సోనియా ఇటీవల కొవిడ్ బారినపడిన సంగతి తెలిసిందే. కరోనా తదనంతర సమస్యలతో ఆమె ఆసుపత్రిలో చేరారు. రాహుల్ ఈడీ విచారణకు వెళ్తోన్న సమయంలో కాంగ్రెస్ నేతలు దేశవ్యాప్త నిరసనలకు దిగారు. నేతల నుంచి లభించిన మద్దతు మధ్య రాహుల్ ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ప్రియాంక గాంధీ రాహుల్ పక్కనే ఉండి చూసుకున్నారు. ఎంటువంటి అవాంఛ నీయ ఘటనలు

తరువాయి 4లో..

# ప్రోటీన్‌లలో మార్పులే పలు రోగాలకు కారణం

## గీతంలో ప్రముఖ శాస్త్రవేత్త ప్రొ. వెంకటేశు



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : మానవ శరీరంలో క్రియాశీలకంగా ఉండే ప్రోటీన్‌లు బయటి వాతావరణంలో వస్తున్న మార్పులకు ప్రభావితం అవుతున్నాయని, వాటి సహజ స్వరూపాన్ని మరియు స్వభావాన్ని కోల్పోవడం వల్ల పలు రోగాలకు దారి తీస్తోందని ప్రముఖ బయోఫిజికల్ కెమిస్ట్ ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పి.వెంకటేశు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనిక శాస్త్ర విభాగంలో సోమవారం తేది:13-06-2022న జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వివిధ రకాల రేడియేషన్‌లు, వాతావరణ మార్పులు మానవ శరీరంపై వత్తిడులు పెంచుతున్నాయని తద్వారా శరీర కణాల లోని ప్రోటీన్‌లు సహజ రూపాన్ని కోల్పోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పులుతో అల్జీమర్స్, పార్కిన్‌సన్, హంటింగ్‌టన్ వంటి వ్యాధులు దరి చేరుతున్నాయని వెల్లడించారు. శరీరంలోని ప్రోటీన్‌ల స్థిరత్వం కోసం జరుగుతున్న అధ్యయనాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రీన్‌టీ త్రాగటం ద్వారా బిపి, మధుమేహం అదుపులో ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. గ్రీన్‌టీలో సహజ సిద్దంగా ఉండే ఫ్రోరైడ్ కారణంగా నోటి కేన్సర్ అవకాశాలు తగ్గుతాయని, దంత క్షయం నివారింపబడుతుందని వివరించారు.ఈ సందర్భంగా ఆయన రసాయన శాస్త్ర పరిశోధకులు పర్యావరణ హితం కోసం గ్రీన్ కెమిస్ట్రీపై అధ్యయనాలు జరపాలని సూచించారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్‌చంద్రబాబు అధ్యక్షత వహించగా రసాయన శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసరావు, సినియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# మలేరియా నివారణపై గీతం అవగాహన ర్యాలీ

సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : మలేరియా వ్యాప్తి చెంద కుండా నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) గీతం వైద్య కళాశాల సామాజిక వైద్య విభాగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యలో సోమవారం తేది:13-06-2022న స్థానిక పెదజాలరిపేటలో వైద్యలు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బి.శ్రీవిద్య మాట్లాడుతూ ఏటా దేశ వ్యాప్తంగా రెండు మిలియన్ల మలేరియా కేసులు నమోదుఅవుతున్నాయని అందులో వెయ్యి మంది మరణిస్తున్నారని తెలిపారు. మలేరియా వ్యాప్తి చెందకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు మురుగునీటి నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీలో వైద్య విద్యార్థులు మలేరియా నియంత్రణపై అవగాహన కలిగించే బోర్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శారద, డాక్టర్ సౌమ్య, జిల్లామలేరియా నియంత్రణ అధికారి శేషయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# సీఎం జగన్ పల్నాడును వల్లకాడుగా మార్చారు

## - కంచర్ల బాలయ్య యాదవ్ కుటుంబాన్ని పరామర్శించిన విశాఖ టిడిపి నాయకులు



వినుకొండ (విజయభాను న్యూస్) : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక సీఎం జగన్ సారధ్యంలో పల్నాడును వల్లకాడుగా మార్చారని విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. సోమవారం గుంటూరు జిల్లా వినుకొండ నియోజకవర్గం గొల్లపల్లి మండలం రావులపురం గ్రామం లో వైసీపీ నాయకుల దురాగతానికి బలైన కంచర్ల బాలయ్య యాదవ్ కుటుంబాన్ని విశాఖ పార్లమెంటరీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బొండ జగన్, విశాఖ పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్ లు పరామర్శించడానికి వెళ్లారు.

ఈ కార్యక్రమం లో పల్లా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పల్నాడు ను వల్లకాడుగా మార్చారు, పల్నాడు వ్యాప్తంగా 12 మంది టిడిపి కార్యకర్తలను హతమార్చారు మొన్న చంద్రయ్య ను నిన్న జాలయ్య ను అతి కిరాతకంగా నరికి చంపారు. పట్టపగలు చంద్రయ్య ని వైసీపీ ఎంపిపి చంపితే శిక్ష లేదు. అప్పుడు శిక్షించి ఉంటే ఈనాడు జాలయ్య యాదవ్ హత్యకు వైసిపి గుండాలు బరితెగించిన వారు కాదు. 37 మంది పల్నాడులో హత్యకు గురికాగా వారిలో 26 మంది బీసీలు ఉన్నారు బీసీలకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నాం బీసీలకు మా ప్రభుత్వం న్యాయం చేస్తుంది అని మాటలు చెబుతూ ప్రజల్ని మోసం చేస్తూ ఇలా బీసీల హత్యకు కారణం అవుతుంది ఈ ప్రభుత్వం. తక్షణమే జాలయ్య హత్యకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి వైసిపి గుండాలను శిక్షించి పల్నాడులో హత్యలకు కారణమవుతున్న పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి ని చట్టపరంగా ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేసారు.



# కొత్త శిక్షణలపై దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం : కొత్త శిక్షణలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్వయం ఉపాధి శిక్షణ సంస్థల సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మష్రూమ్, ఎపీకల్చర్ లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఆరు నెలల్లో ఎంత మందికి శిక్షణ ఇచ్చారని, తర్వాత ఆరు నెలల్లో ఎంత మందికి శిక్షణ ఇచ్చారని, ఇందుకు ఎంత ఖర్చు అయిందని ఆయన అడిగి తెలుసుకున్నారు.శిక్షణ తీసుకున్న వారు ఎంత అభివృద్ధి చెందారు, వారి వివరాలు వచ్చే సమావేశం నాటికి అందజేయాలని ఆదేశించారు. 2015-16 నుండి ఇప్పటి వరకు శిక్షణకు అయిన ఖర్చులు గ్రామీణాభివృద్ధి శాఖ నుండి రావలసిన బకాయిలు తిరిగి పొందుట పై చర్చించారు. శిక్షణ పొందిన అభ్యర్థుల అందరికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వయం ఉపాధి సంఘాలకు శిక్షణ ఇచ్చేందుకు డిఆర్డిఎ పిడి ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (యూనియన్ బ్యాంక్) సౌజన్యంతో శిక్షణ గూర్చి ప్రణాళిక రూపొందించడం జరిగిందని యూనియన్ బ్యాంక్ ఆర్సెటీ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు కలెక్టర్ కు వివరించారు.

మొదటి పేజీ తరువాయి

# మరింత పారదర్శకంగా ఆరోగ్య శ్రీ పథకం

దాదాపు రూ.4వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇక, గతేడాది ఆయుష్మాన్ భారత్ కింద రాష్ట్రానికి అందింది రూ. 223 కోట్లు అని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది రూ.360 కోట్లు ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు.

**మరింత పారదర్శకంగా ఆరోగ్య శ్రీ పథకం..**

నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకి డబ్బు, అక్కడ నుంచి ఆస్పత్రికి ఆటోడెబిట్‌లో చెల్లింపులు, ఎవ్వరికీ అసౌకర్యం కలగకుండా ఈ ప్రక్రియ కొనసాగాలి. ముందుగా పేషెంటు డిశ్చార్జి అయ్యే సమయంలో కన్సెంటు ఫారం స్వీకరణ, పేషెంటు, బ్యాంకు, ఆస్పత్రి మధ్య కన్సెంటుతో కూడిన ఫారం ఇవ్వాలి. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ విధానంలో చాలా వరకు పొరపాట్లను నివారించే అవకాశం ఉంటుందని సీఎం జగన్ తెలిపారు.

**కోవిడ్ పరిస్థితులపై సీఎం సమీక్ష..**

కోవిడ్ పరిస్థితులన్నీ పూర్తిగా నియంత్రణలో ఉన్నాయని అధికారులు తెలుపగా.. అప్రమత్తంగా ఉండాలని సీఎం జగన్ ఆదేశించారు.

**రాష్ట్రంలో కోవిడ్ వ్యాక్సినేషన్‌పై సీఎం సమీక్ష**

18 సంవత్సరాల్లోపు వారికి కూడా రెండుడోసులు దాదాపుగా పూర్తి.

15 నుంచి 17 ఏళ్లలోపు వారికి 99.65శాతం వ్యాక్సినేషన్ పూర్తి.

12 నుంచి 14 ఏళ్లలోపు వారికి 97.78శాతం వ్యాక్సినేషన్ పూర్తి.

నిర్దేశించుకున్న సమయంలోగా పనులు..

విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్, కొత్త ఆస్పత్రుల నిర్మాణం, వీటిలో అభివృద్ధి పనులు నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తిచేయాలని సీఎం జగన్ ఆదేశించారు. కాగా, విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్‌లో పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, కొత్తవాటి నిర్మాణం కూడా పూర్తవుతోందని అధికారులు తెలిపారు. పీహెచ్‌సీల్లో 977 సెంటర్లలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, కొత్తవాటి నిర్మాణం చురుగ్గా సాగుతోందని అధికారులు చెప్పారు.

కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణంపై సీఎం సమీక్ష

రాష్ట్రంలో కొత్తగా 16 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నంలలో కొత్త మెడికల్ కాలేజీల్లో 2023 నుంచి మెడికల్ ప్రవేశాల కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాల ప్రకారం చేయాల్సిన పనులు వేగంగా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాము. ఇక్కడ డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మిగిలిన చోట్ల కూడా నిర్మాణాలు వేగవంతం చేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఒకటి రెండు చోట్ల స్థలాలపై కోర్టు కేసులున్నాయని అధికారులు తెలుపడంతో.. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేయాలని సీఎం జగన్ సూచించారు.

క్యాన్సర్ కేర్‌పై ప్రభుత్వం దృష్టి..

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. 2020లో ఏపీలో 34వేల మంది క్యాన్సర్ కారణంగా మృతి చెందారు. ప్రాథమిక దశలో గుర్తించకపోవడం వల్ల చాలా మంది మరణిస్తున్నారని అధికారులు తెలిపారు. చివరిదశలో గుర్తించి, చికిత్సకోసం భారీగా ఖర్చు చేస్తున్నారని అప్పటికే పరిస్థితి చేయిదాటిపోతుందని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో విలేజ్ క్లినిక్స్ స్థాయిలోనే క్యాన్సర్ గుర్తింపుపై దృష్టి పెట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. అందుకోసం విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్, పీహెచ్‌సీలను వీలైనంత త్వరగా పూర్తిచేసుకోవాలని సీఎం సూచించారు. డిసెంబర్ కల్లా వీటిని పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇవి పూర్తి అయితే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం సమర్థవంతంగా అమలు జరుగుతుంది, క్యాన్సర్ గుర్తింపు అన్నది సులభంగా జరుగుతుందని సీఎం జగన్ తెలిపారు. ఈలోగా సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇప్పించాలని సూచించారు.

దీని వల్ల క్యాన్సర్ గుర్తింపు నుంచి చికిత్స వరకూ సమర్థవంతమైన వ్యవస్థ ఏర్పడుతుందని సీఎం జగన్ తెలిపారు. ఈ సందర్భంగా టాటా మెమోరియల్ ద్వారా రాష్ట్రంలో వైద్య సిబ్బందికి, వైద్యులకు శిక్షణకు ఎంఓయూ కుదిరిందని అధికారులు వివరణ ఇచ్చారు. దీంతోపాటు స్విమ్స్ ఆస్పత్రిని కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే 16 మెడికల్ కాలేజీలతో కలిపి 27 మెడికల్ కాలేజీల్లో కూడా క్యాన్సర్ నివారణకు రెండేసి చొప్పున లైనాక్ మెషిన్లు ఉండేలా బ్లూ ప్రింట్ ఇవ్వాలని సీఎం చెప్పారు. ఇందులో మూడు కాలేజీల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. విశాఖ, తిరుపతి, గుంటూరులో క్యాన్సర్ నివారణపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పెట్టాలని ప్రతిపాదించారు. పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధంచేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్ శర్మ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి(కోవిడ్ మేనేజిమెంట్ అండ్ వ్యాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్యశాఖ స్పెషల్ సెక్రటరీ జీఎస్ నవీన్ కుమార్, ఆరోగ్యశ్రీ సీఈఓ వి.వినయ్ చంద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి. మురళీధర్ రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ వి. వినోద్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ (డ్రగ్స్) రవిశంకర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## (ఏపీపీఎస్సీ) నచ్చిన వారిని ఎంపిక చేసేందుకు

# నిబంధనల ఉల్లంఘన

తప్పకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న ప్రభుత్వ హామీ అమలవుతుందని మూడేళ్లగా యువత ఎదురు చూస్తున్నా... ఫలితం శూన్యమని చంద్రబాబు మండిపడ్డారు.

"గ్రూప్-1 ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక విషయంలో గత 3 సంవత్సరాలుగా ఏపీపీఎస్సీ వ్యవహరిస్తున్న తీరు అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2018లో ప్రకటించిన 165 గ్రూప్-1 ఉద్యోగాలకు డిసెంబర్ 2019లో రాత పరీక్షలు జరిపారు. 2021 మేలో ఫలితాలు ప్రకటించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష తేదీల ప్రకటన నుంచి ఫలితాల విడుదల వరకు అడుగడుగునా అవకతవకలకు పాల్పడ్డారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మెయిన్స్ పరీక్షల తేదీలను ఐదుసార్లు మార్చారు. మూల్యాంకనం తప్పుడు తడకలుగా జరిగింది. తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకునేందుకు కమిషన్ కార్యదర్శి, సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని అభ్యర్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం మొదటి, రెండో సారి నిర్వహించిన మూల్యాంకనానికి వెలువడిన ఫలితాల్లో 15 శాతం తేడా లేనప్పుడు మూడో సారి మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకునేందుకు గ్రూప్-1 మెయిన్స్‌లో అక్రమాలకు తెరతీశారు. మొదటిసారి విడుదల చేసిన ఫలితాలకు, రెండోసారి విడుదల చేసిన ఫలితాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి. గతంలో గ్రామ సచివాలయ ఉద్యోగుల ఎంపికలో సైతం అక్రమాలు జరిగినట్టు పలువురు అభ్యర్థులు ఫిర్యాదు చేశారు.

నోటిఫికేషన్లు ఇవ్వకపోవటంతో లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో

## విశాఖ తూర్పు మరియు భీమిలి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం




విశాఖపట్నం (విజయభాను న్యూస్): సోమవారం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విశాఖ తూర్పు మరియు భీమిలి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా రాజ్య సభ సభ్యులు జివిఎల్. నరసింహారావు విచ్చేసారు. ఈ సందర్భంగా జివిఎల్.నరసింహా రావు మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక సమస్యలు మరియు రాజకీయ వాతావరణం గురించి అక్కడి నాయకులను అడిగి తెలుసుకొని వారితో చర్చించి రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి చేయవలసిన కార్యాచరణ గురించి వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి మరియు విశాఖపట్నం నగరానికి చేసే అభివృద్ధి మరియు కేటాయింపుల గురించి తెలుపుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజల వద్దకు చేరవేసే విధరా కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ కొప్పిశెట్టి, దిలీప్ వర్మ, బీజేపీ రాష్ట్ర ఆర్టిఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, బీజేపీ భీమిలి నియోజకవర్గ కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు మరియు బీజేపీ నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ కనిపిస్తే చర్యలు తప్పవు

### - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నిషేధిత ప్లాస్టిక్ కనిపిస్తే చర్యలు తప్పవని జివిఎంసి కమిషనర్డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జ్ఞానపురం కూరగాయలమార్కెట్, పూర్ణా మార్కెట్ లలో సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిషేధితప్లాస్టిక్ ను అమ్మిన, వినియోగించిన అపరాధ రుసుం వసూలు చేస్తామని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపైఇప్పటికే బజారులో అవగాహన కల్పించినా, ఆకడ్కక్కడ ప్లాస్టిక్ వినియోగం కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బజార్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధిత స్టిక్కర్లుబజార్లలోని, దుకాణాల వద్దగాని, ఆటోలకు గాని పూర్తి స్థాయిలో అతికించ లేదని, అవి కనిపించే విధంగాఅతికించాలని అధికారులను ఆదేశించారు. మనం మన భావితరాల శ్రేయస్సు కోరి ఈ ప్లాస్టిక్ నిషేధం అమలుచేస్తున్నామని అందుకు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ పర్యటనలో మూడవ జోనల్ కమిషనర్ బి.వి.రమణ, నాలుగవ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఎఎంఓహెచ్ డాక్టర్ కిషోర్, డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్వైజర్, శానిటరీఇన్స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ డైరీ కూడలి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం


### - ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు మహిళలు దుర్మరణం

గాజువాక (విజయభాను న్యూస్): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ప్రమాదం లో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలైయ్యారు . గాజువాక పోలీస్టేషన్ పరిధి విశాఖ డైరీ కూడలి వద్ద సోమవారం జరిగిన ఈ ఘటన పై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం జెర్రిపోతుల శ్రావణి లక్ష్మి (31 ), పేడిశెట్టి సొంతోషి(26 )లు ద్విచక్రవాహనం మీద సింహచలం నుండి పరవాడ ఇంటికి వెల్తున్న సమయంలో విశాఖ డైరీ వద్ద ఆగి ఐస్ క్రీమ్ తిని అనంతరం తిరిగి ఇంటికి వెళ్లేందుకు వాహనాన్ని తియ్యగా అతివేగం వస్తున్నా సినర్జీ షిప్పింగ్ ప్రయివేట్ కంపనీ కి చెందిన లారి (ఏపీ 39 ఏ వై 4655) ఢీ కొనడం తో ఇద్దరు మహిళలు అక్కిడిఅక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న గాజువాక పోలీసులు మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం కె జి హెచ్ కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు, పూర్తి వివరాలు తెలియాల్సివుందని పోలీసులు తెలిపారు.



## వైసీపీ పాలనలో ఇంటివద్దకే సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు



అచ్చుతాపురం (విజయభాను న్యూస్) : వైసిపి పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు సీఎం జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణ మూర్తి రాజు అన్నారు. సోమవారం ఆయన మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ తో కలిసి మండలంలో పెదపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీదే అధికారం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి , జెడ్పీటీసీ లాలం రాంబాబు , కో ఆప్షన్ జెడ్పిటిసి నర్మల కుమార్ , మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు, సర్పంచ్ విమలనాయుడు , ఎంపీటీసీ ద్వారపురెడ్డి వెంకట్ లక్ష్మి బాబ్జి, వైసీపీ నాయకులు తోట వెంకటేష్, పోలవరపు పారు నాయుడు, గంగూలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 87వ వార్డు వడ్లపూడి లో 7వ రోజు

# గడప-గడపకు మన ప్రభుత్వము

### గాజువాక శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి



గాజువాక (విజయభాను న్యూస్): నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో 87వవార్డు వడ్లపూడి గణేష్ నగర్ -2 సచివాలయం 1086379 పరిధిలో 7వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది . సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని వాసవి హాస్పిటల్ ఎదురుగా ఉన్న గవరు వీధి,కణితి కాలనీ తెలుకుల వీధి మెయిన్ రోడ్డు నుండి వడ్లపూడి సిగ్నల్ పాయింట్ మెయిన్ రోడ్డు ఏరియా వరకు ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటూ ఆ సమస్యలు వెంటనే ఆక్కడ ఉన్న సంబంధించిన అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే ప్రజల సమస్యలు పరిష్కారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ వడ్లపూడి గణేష్ నగర్ సచివాలయం -2 పరిధిలో గడప గడపకు కార్యక్రమం ఈరోజుతో ముగిసినదని, ఈ సచివాలయం లో ఉన్న ఉన్న మొత్తం గడపలు 1440 గాను 1380 గడప గడపలకు వెళ్లి రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు సంక్షేమ ఫలాలు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించి మిగతావి సంబంధించిన అధికారులతో మాట్లాడి కూడా వాటిని కూడా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశాం అని అన్నారు. ప్రతి గడప లో కూడా జగనన్న నవరత్న పథకాలు సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని అలాగే మేము వెళ్లే ప్రతి గడప లోను అపూర్వ స్వాగతం పలుకుతూ మమ్మల్ని ఆశీర్వదించారని అన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా 30 సంవత్సరాల చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు,ఇంచార్జ్ కోమటి శ్రీనివాస రావు ప్రగడ వేణుబాబు,ముద్దపు దామోదర్ దుగ్గపు దానప్పలు బొడ్డ గోవింద్ బొండా గోవిందరాజు ఏన్నటి రమణ చిత్రాడ. వెంకటరమణ, ప్రగడ శ్రీను కోమటి రమాదేవి, వడ్లపూడి ఈశ్వరావు, కోనేటి పారిపల్లి, శీరం పాపారావు, జెర్రిపోతుల ఈశ్వరావు,పూడి. ఆనంద్, గుడ్ల శివారెడ్డి,కణితి. అప్పలరాజు,వంద్రాసి సన్యాసిరావు,దాసరి రమణ, శీరపు కనకరాజు,దేవర తాతారావు, పావడ శ్రీనివాస రావు, జొన్నకూటి విజయకుమార్,వంద్రాసి వెంకటరావు,కాంద్రేగుల కనక,కర్ణం లక్ష్మి,గెద్దాడ పద్మ, వేముల వెంకన్న, చొప్ప శ్రీను, చట్టి రాము, వడ్లపూడి రాజు, కణితి నగేష్,సుందరమూర్తి,సచివాలయం సిబ్బంది,వాలంటీర్లు, జీవిఎంసి వాటర్, సానిటేషన్ సిబ్బంది, విద్యుత్, ద్వాక్రా ఆర్. పి లు, ఎ. యన్. యం లు, వార్డు ప్రజలు, పాల్గొన్నారు.

## అప్పన్న స్వామికి 27 కేట్లుతో మామిడి పళ్లు సమర్పణ



సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి కి స్థానిక వి ఆర్ ఓ జామి రాము తన సొంత తోటలో పండిన బంగిన పల్లి మామిడి పళ్ళు సుమారు 27 కేట్లతో సోమవారం సమర్పణ చేశారు. ఆలయం లో స్వామి వారికి ఆరగింపు చేసి భక్తి చాటు కున్నారు. అనంతరం ఆయా పళ్లను ఇఓ ఎంవి సూర్య కళ భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇఓ సూర్య కళ మాట్లాడుతూ పండిన పంటను లాభాలకు విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్న తరుణంలో స్వామివారికి సమర్పణ చేయాలని భావించటం అభినందనీయం అని వి ఆర్ ఓ రాముని అభినందించారు.కిందట సంవత్సరం కూడా రాము ఇలాగే అప్పన్న కు మామిడి పళ్ళు సమర్పణ చేసిన సంగతి గుర్తు చేశారు. ఈ సందర్భంగా మామిడి పంట దాత జామి రాము మాట్లాడుతూ సాంప్రదాయంగా ప్రతిఏటా తోట నుంచి మామిడి పళ్ల అప్పన్న స్వామివారికి సమర్పించుకునే అదృష్టం తనకు దక్కిందని అన్నారు.

కార్యక్రమం లో సహాయ ఈఓ లు, దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు. భక్తులు సైతం సంతోషం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన

### కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : నాడు -నేడు కార్యక్రమం లో భాగంగా జీవీఎంసీ 2వ వార్డు రాయపాలెం గ్రామం లోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం 12 లక్షల రూపాయలు వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొబ్బరికాయ కొట్టి శంఖుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ నాడు నేడు పనులలో భాగంగా ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కి ప్రభుత్వం 12లక్షల రూపాయలు మంజూరు చేసిందనీ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు కార్పొరేటర్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి డీ పి సీనియర్ నాయకులు గాడు అప్పల నాయుడు పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు చిల్ల లావణ్య మరియు స్థానిక నాయకులు పూతి రవికుమార్, నగిరెడ్ల హరీష్ రెడ్డి, బెల్లాన ఆదిరెడ్డి లు పాల్గొన్నారు.



## ఇతరులకు మానవత్వంతో సహాయం చేయడం తనకు ప్రవృత్తిగా మారింది

### కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జీవీఎంసీ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం జీవీఎంసీ ఐదవ వార్డు మారిక వలసకు చెందిన పేదకుటుంబం జగన్ మోహన్ రావు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె అనూష వివాహం నిశ్చయమైందన్న సమాచారంతో ఆ కుటుంబ సభ్యులను పిలిచి బంగారు తాళిబొట్టు, పట్టుచీర, గాజులు,పసుపు కుంకుమలు అందచేసి తన సహృదయాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఇతరులకు మానవత్వంతో సహాయం చెయ్యడం తనకు ప్రవృత్తిగా మారిందన్నారు. తన వివాహానికి ఊహించని విధంగా మంచిమనిషి కందుల నాగరాజు చేతులమీదుగా తాళిబొట్టు,పట్టుచీర అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కాబోయే వధువు అనూష ఆనందంగా చెప్పింది.ఈ కార్యక్రమంలో జవహర్,లక్ష్మి నారాయణ,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సునీత, బంగారు శెట్టి, అశోక్, శ్రవణ్, సంతోష్, షాజన్,అప్పారావు,సునీల్, డాల్ఫిన్ శంకర్, మల్లేష్, మణి,వర, జానకి,రాజేశ్వరి, జాన్సీ,దుర్గ, కుమారి,32



# విజయభాను

## సంపాదకీయం

### ఊహాలోకంలో...

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హోటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ఏర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది.

యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్ధాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే ట్కస్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేకపోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించుకోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొందరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.




**వీ.ఎం.ఆర్.డీ.ఏ లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 8 దరఖాస్తులు వచ్చినవి. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కరమాని విజయనిర్మల, ఛైర్పర్సన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, జాయింట్ కమిషనర్ రవీంద్ర, సూపరింటెండెంట్ ఇంజనీర్ భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, డీ ఎఫ్ ఓ శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.**

## రాహుల్‌ను 3 గంటల పాటు ప్రశ్నించిన ఈడీ

చోటుచేసుకుండా నిరసనకారుల్ని పోలీసులు ఎక్కడిక్కడే నిలువరించారు. రణ్‌దీప్ సూర్జేవాలా, హరీశ్ రావత్ వంటి సీనియర్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. మరోపక్క, సోనియా ఇదే కేసులో ఈ నెల 23న ఈడీ ముందు హాజరురావాల్సి ఉంది.కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై కేంద్రం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, హరీశ్ రావత్ సహా పలువురు నేతలను తుగ్లక్ రోడ్డు పోలీసుస్టేషన్‌కు తరలించగా.. వారిని కలిసేందుకు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ వాద్రా స్టేషన్‌కు వెళ్లారు. ఆమె రాకతో పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడినప్పటికీ.. చివరకు ప్రియాంకాను లోపలికి అనుమతించారు.

వేణుగోపాల్ సహా నేతలను కలిసిన ప్రియాంక వారితోపాటు కొద్దిసేపు స్టేషన్‌లోనే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ కూడా ఉన్నారు. ఆయన్ను మరో పోలీసస్టేషన్‌కు తరలించారు. తనతోపాటు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలిస్తున్న ఫొటోలు, వీడియోలను గెహ్లాత్ తన ట్విటర్ ఖాతాలో పంచుకున్నారు. పోలీసుల వైఖరి దారుణంగా ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన నేతలు మల్లికార్జున్ ఖర్గే, జైరామ్ రమేశ్, దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్, దీపేందర్ హుడా పలురువు నేతలను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో భాజపా బలంగా ఉంది

జనసేన.. అన్ని పార్టీలు భాజపాకే మద్దతు ఇస్తాయి. ఏపీలో భాజపాను వ్యతిరేకించే పరిస్థితి లేదు'' అని ఉండవల్లి తెలిపారు. "భాజపా పట్ల నాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. మోదీ మరోసారి ప్రధాని అయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ముస్లిం, క్రైస్తవులకు వ్యతిరేకమనే ముద్ర భారత్‌కు మంచిది కాదు. భాజపా నేతల వ్యాఖ్యల వల్ల ముస్లిం దేశాల్లో వ్యతిరేకత వస్తోంది. నాలుగైదు దేశాలు క్షమాపణ చెప్పాలని భారత్‌ను కోరాయి. ఎవరు అధికారంలో ఉన్నా ప్రశ్నించే ప్రతిపక్షం గట్టిగా ఉండాలి. మోదీ ఒక నిరంకుశ రాజులా పాలిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ ఉండొద్దనే కోణంలోనే భాజపా ముందుకు వెళ్తోంది. దేశంలో భాజపాకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడే పరిస్థితి లేదు. కేసీఆర్ మాత్రం ధైర్యంగా భాజపాకు వ్యతిరేకంగా వెళ్తున్నారు. జాతీయ అంశాలపై కేసీఆర్ కసరత్తు చేశారు. చాలా విషయాల్లో కేసీఆర్ స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. ప్రతి విషయాన్ని ఆయన స్పష్టంగా వివరించారు. భాజపా వల్ల దేశానికి ప్రమాదం ఉందని చెప్పారు. భాజపాను అడ్డుకోకపోతే మరింత నష్టమన్నారు. నేను మాత్రం రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పాను. మా భేటీలో ప్రశాంత్ కిశోర్ కూడా ఉన్నారు. ప్రధాని మోదీ లాగే కేసీఆర్ కూడా మంచి వక్త, కమ్యూనికేటర్. కేసీఆర్ హిందీ, ఇంగ్లీష్‌లోనూ బాగా మాట్లాడగలరు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇతర రాష్ట్రాల్లో పెద్దగా ప్రభావం చూపలేరు'' అని ఉండవల్లి పేర్కొన్నారు.

**భాజపాకు వైకాపా మద్దతు కీలకం..**

"రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయేకు పెద్ద మెజారిటీ లేదు. వైకాపాకు 23 మంది ఎంపీలు, 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో భాజపాకు వైకాపా మద్దతు చాలా కీలకం. ఈ పరిస్థితుల్లో తమ సమస్య పరిష్కరించాలని వైకాపా చెబితే భాజపా చేసి తీరాలి. తనకున్న బలంతో వైకాపా రాష్ట్రానికి కావాల్సింది సాధించుకోవచ్చు'' అని ఉండవల్లి చెప్పారు.

## కవి సమయం

### మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తథ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పధజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

...రచయిత
యల్.సిద్ధూ

## పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి : పూర్ణిమ సా.5.44; జ్యేష్ఠ రా.7.26; రా.వ.2.54ల 4.23.

మంగళవారం 14 -06 -2022

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవలు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కొంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.

## లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి వృత్తాంతం!!



లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగంలో క్రీ.శ 776లో జన్మించినట్లు పురాణాలు చెపుతున్నాయి. ద్రవిడ భాషల్లో గోదాదేవికి కోదై, చూడిక్కొడుత్త నాచ్చియార్, ఆండాళ్, అనే నామాంతరములు గలవు. తెలుగు సాహిత్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ప్రఖ్యాతి వహించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు రచించిన తెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద గోదాదేవీ వైశిష్ట్యమునకు ప్రతీక. ఈ ప్రబంధానికి విష్ణుచిత్తీయం అనే మరోపేరున్న సంగతి తెలిసిందే.

ఇక గోదాదేవి జన్మ వృత్తాంత్తాన్ని ఓ సారి పరిశీలిస్తే.. శ్రీరంగంలో ఆషాఢ శుద్ధ చతుర్దశిన, పుబ్బ నక్షత్రంలో గోదాదేవి జన్మించింది. గోదాదేవి, శ్రీ విష్ణుచిత్తులకు పూలతోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తర్వాత లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలనుకుంటుంది.

వైష్ణవుడైన విష్ణుచిత్తుడు రంగనాథ స్వామిని ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో కొలిచేవాడు. ఇందులో భాగంగా... ప్రతిరోజూ స్వామివారికి పూలమాలలను సుందరంగా అల్లుకుని అలంకరణకు తీసుకుని వెళ్లేవాడు. అయితే వాటిని గోదాదేవి ముందే ధరించి తర్వాత స్వామివారికి పంపిస్తుంది.

ఈ రహస్యం తెలుసుకున్న విష్ణుచిత్తుడు దుఃఖించి రంగనాథుడికి మాలాధారణ గావించరు. దీంతో స్వామివారి మొహం చిన్నబోతుంది, దీనికంతటికీ తన కుమార్తె తప్పిదమే కారణమని విష్ణుచిత్తుడు బాధపడుతుంటే.. రంగనాథుడు విష్ణుచిత్తునితో ఇక ప్రతిరోజూ తనకు గోదాదేవి ధరించిన మాలాధారనే కావాలని ఆదేశిస్తారు. రంగన్న ఆదేశం మేరకే విష్ణుచిత్తుడు నడుచుకుంటాడు. గంతలో శ్రీరంగనాథుడే తనకు భర్తగా రావాలని కోరుకుంటూ గోదాదేవి... తన తోటి బాలికలతో కలిసి తిరుప్పావై (తిరుప్పావు) వ్రతాచరణ చేస్తారు. ఈ వ్రతమహిమతో... లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగనాథుడి సతీమణి అవుతుంది. రంగనాథుడి ఆజ్ఞమేరకే గోదాదేవికి, రంగనాథస్వామికి విష్ణుచిత్తుడు దేవేరులకు భూలోకంలో వైభవంగా వివాహం జరిపించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. వివాహానంతరం గోదాదేవి ఆ చిద్విలాసునిలో లీనమవుతుంది. అదిచూసి

### సంకీర్తన

విష్ణుచిత్తుడు దుఃఖితుడైతే మలయప్ప స్వామి జ్ఞానోపదేశం చేస్తాడు. దీంతో విష్ణుచిత్తుడు గోదాదేవి లక్ష్మీస్వరూపి అని, తన కుమార్తె అన్న మాయ నుంచి బయటపడతాడు. ఇకపోతే... గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై చాలా ప్రసిద్ధి చెందింది.

దీనిని ధనుర్మాసంలో ప్రతిరోజూ రోజుకొక్కటి చొప్పున ఓ పాశురం వైష్ణవ ఆలయాల్లో పఠించడం చేస్తారు. అందుచేత యువతులు ధనుర్మాసంలో 30 రోజుల పాటు గోదాదేవి వ్రతాచరణ చేస్తే తను మెచ్చిన, సుగుణుడైన భర్త లభిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

# శతాధిక రక్తదాత.. ఎందరికో ప్రాణదాత

## సూరాడ అప్పారావు..24 ఏళ్లలో..113 సార్లు రక్తదానం..
## ఏడాదికి.. మూడు సార్లు రక్తదానం



విశాఖపట్నం(విజయభాను న్యూస్): సూరాడ అప్పారావు..24 ఏళ్లలో..113 సార్లు రక్తదానం.. ఏడాదికి.. మూడు సార్లు రక్తదానం..

రక్తదాన శిబిరాలు ఏర్పాటు..

యువతలో చైతన్యం తీసుకువచ్చి..

రక్తదానం చేసేలా ప్రోత్సాహం..

తండ్రి బాటలోనే.. తనయులు..

సూరాడ అప్పారావు..సేవకు మారుపేరు.. ఎందరికో ప్రాణదాత..మరెందరికో స్ఫూర్తి ప్రదాత..విశాఖ, పాత నగరంలో ఉన్న వివేకానంద సంస్థ అధ్యక్షుడు..సకాలంలో రక్తం అందక..ఏ ఒక్కరి ప్రాణం పోకూడదు.. అనే లక్ష్యంతో ఆయన 24 ఏళ్లుగా రక్తదానం చేస్తునే ఉన్నారు.ఏడాదికి మూడు, నాలుగు పర్యాయాలు తప్పనిసరిగా రక్త దానం చేస్తారు. ఇప్పటి వరకు 113 సార్లు రక్త దానం చేసి ఎందరికో ప్రాణదాతగా, మరెందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. తాను రక్తదానం చేయడమే కాకుండా.. రక్త దానంపై యువతలో అవగాహన పెంచి, చైతన్యం తీసుకువచ్చి వారు రక్తదానం చేసేలా ప్రోత్స హిస్తున్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. యువకులు అందరితో కలిసి ఆయన ప్రతీ ఏడాది రెండు పర్యాయాలు.. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున రక్త నిల్వలు సేకరించి బ్లడ్ బ్యాంకులకు అందజేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పూనం మాల కొండయ్య చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు.. జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, మేయరు చేతులమీదుగా కూడా ఆయన సత్కారాలు అందుకున్నారు. ఆయన బాటలోనే ఆయన తనయులు నడుస్తు న్నారు. ఆయన కుమార్తెలు, కుమారులు కూడా ప్రతీ ఏడాది తప్పనిసరిగా రక్తదానం చేస్తున్నారు. చిన్న వయసులోనే రక్తదానం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

# ఇగ్నోలో ఎంబీఏ అడ్మిషన్లు ప్రారంభం

- **ఏఐసిటిఇ గుర్తింపు - ప్రవేశ పరీక్ష లేదు**
- **మొత్తం ఐదు రకాల స్పెషలైజేషన్లతో**
- **ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు**
- **గడువు తేదీ జూలై 31, 2022**

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2022 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఐదు రకాల ఎంబీఏ డిగ్రీలకు ప్రకటన జారీ చేసింది. సాధారణ ఎంబీఏ తో పాటుగా ఎంబీఏ (హెచ్ ఆర్), ఎంబీఏ (మార్కెటింగ్), ఎంబీఏ (ఫైనాన్స్), ఎంబీఏ (ఆపరేషన్స్) అనే ఈ ఐదు రకాల ఎంబీఏలకు ఏ ఐ సి టి ఇ గుర్తింపు ఉంది. ఈ ఐదు ఎంబీఏ లు దూరవిద్యా విధానంలో అందుబాటులో ఉన్నాయి. దూరవిద్య ఎంబీఏ తో పాటు పూర్తి ఆన్ లైన్ మాధ్యమంలో కూడా ఎంబీఏ ప్రవేశాలు ఉన్నాయి. ఈ అన్ని రకాల అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందవలసి ఉంటుంది. ఇగ్నో వెబ్సైట్ లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు.https://ignouadmission.samarth.edu.in/ఈ కోర్సులలో ప్రవేశాలకు గడువుతేదీ జూలై 31, 2022. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 5 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ఎంబీఏ ప్రవేశాలు పొందే వీలుంది.

ప్రవేశాలన్నీ ఆన్లైన్ విధానంద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకోసం ఇగ్నో వెబ్సైట్ చూడవచ్చు లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిలు ద్వారా సంప్రదించవచ్చు.

**గడువు తేదీ 31.07.2022**

### ఆలయ పునర్నిర్మాణానికి
### మాజీ ఏఎంసీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు విరాళం



ఆనందపురం: ఆనందపురం మండలం చందక గ్రామం లో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వ హించారు.

ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు స్వామివారి కి జరిపారు. ఈ ఆలయ నిర్మాణానికి భీమిలి మాజీ ఏఎంసీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు 75 వేల రూపాయలు విరాళం ను తనయుడు వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో గత దశాబ్ద కాలంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎక్కువ వ్యయం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి మాజీ ఎమ్మెల్యే

కర్రి సీతారాం, మాజీ సర్పంచ్ పాండ్రంకి అప్పలరాజు, బంక సత్యం, ఎర్ర రాము, మోహనరావు, , లెంక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### *ప్రజల సమస్యలపై*
### *సిపిఎం ఇంటింటికి కార్యక్రమం*

భీమునిపట్నం : జనం కోసం ఇంటింటికీ సిపిఎం కార్యక్రమంలో భాగంగా భీమిలి జోన్ జీవీఎంసీ 1 వ వార్డు విల్సన్ పేట, కొత్తపేట ప్రాంతాల్లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సమస్యలపై అధ్యయన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంబంధించిన అధికారులకి సమస్యను వివరించి పరిష్కారానికై సిపిఎం పార్టీ కృషి చేస్తుందని ప్రజలు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ , ఆర్టీసీ చార్జీలు, నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి ప్రజలు కోలుకోలేని విధంగా చేస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు కు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతుందని చెప్పారు.

# సత్యదేవుడ్ని దర్శించుకున్న
# తాడేపల్లి విజిలెన్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌రాజు



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని సోమవారం తాడేపల్లి విజిలెన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు కుటుంబ సమేతముగా శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా ఆలయ అధికారులు శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు.

# సిసి రోడ్డుకు ఎస్టిమేషన్ కొలతలు



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) మండలంలోని బొండం పంచాయితీ మజ్జివలస గ్రామములో పంచాయితీ సర్పంచ్ దురియా. భాస్కరరావు. సోమవారం మజ్జివలస లో సందర్శించి 100 మీటర్ల సిసి రోడ్డుకు కథలు నిర్వహించారు అంతేకాకుండా...

గ్రామములో పలు సమస్యల గురించి గ్రామ ప్రజలను అడిగి తెలుసు కున్నారు పెద్దలు గ్రామస్తులు సమస్యల పట్ల డ్రైనేజీ త్రాగునీరు లపై త్వరితగతిన వాటి విషయమై గ్రామ సభలో చర్చించి త్వరిగతి నా పనులు ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మజ్జివలస వార్డు మెంబర్ గొల్లూరి గాసి. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రి నారసింహా స్తోత్ర మంజరి గ్రంథ ఆవిష్కరణ

## ముడుంబై వారి రచనలకు ముద్రణ చేసిన భక్తుడు సత్యసాయి



సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామి వారి దేవస్థానం లో స్వామివారి వైభవాన్ని కీర్తిస్తూ భగవత్కవి ముడుంబై నరసింహాచార్యులు రచించిన మహోన్నత పద్య, గద్య శ్లోకాలను గ్రంథస్తం చేస్తూ ఒక భక్తుడు చేసిన పుస్తకాన్ని సోమవారం ఆలయం లో ఆవిష్కరణ జరిగింది. ఇఓ ఎంవి సూర్యకళ చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు.ఆలయ స్తానా చార్యులు డా పి.రాజగోపాల్ తొలి పుస్తకాన్ని అందుకున్నారు. ఇందులో ప్రధానంగా,శ్రీ సింహగిరి నాథ వింశతి, సంతాన గోపాల స్తవహ మంద హాస స్తవహ భగవన్నఖ శతకం, ప్రాప్తి గద్యం నృసింహ దండకం అనే స్తోత్రాలు వున్నాయి. ఈ సందర్భంగా ఇఓ ఎంవి సూర్య కళ మాట్లాడుతూ శ్రీ నృసింహ జయంతి పర్వదినం నాడు ఇటువంటి మహా భక్తుల రచనలను ఆవిష్కరించటం ఆనందంగా వుందని ఇఓ ఎంవి సూర్య కళ అన్నారు.మహా భక్తుల రచనలు చదవటం వలన భక్తులకు భగవంతుని అనుగ్రహం తొందరగా లభిస్తుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.సంతాన గోపాల స్తవం రచన ద్వారా ఆలయం లోనూ కప్పస్తంభం వైభవం మరింత ప్రాచుర్యం పొందుతోంది అన్నారు. అలాగే మందహాస స్తవం అప్పన్న స్వామి వారి కళ్యాణ వైభవం, ప్రాప్తి గద్యం స్వామివారిని ఎలా దర్శించాలో తెలుపుతుంది ఇఓ సూర్య కళ వివరించారు. ఇంతటి విశిష్టత కలిగిన రచనలను వెలుగులోనికి తెచ్చిన పుస్తక ముద్రణ దాత, కేతినీ డి సత్య సాయి చంద్ర కుమార్ కుటుంబ సభ్యులను ఇఓ ఘనంగా ప్రశంసించారు. గ్రంథ సమర్పణ చేసిన సింహాచలం శ్రీ వైష్ణవ సంప్రదాయ సభ ను ఇఓ అభినందించారు. అలాగే స్థానాచార్యులు డా టి పి రాజగోపాల్ మాట్లాడుతూ ముడుంబై వారి విశిష్ట సేవలను, రచనలను కీర్తించారు. అలాగే సత్ గ్రంథ రచనల ముద్రణ కు ముందుకొచ్చిన సత్య సాయికు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథ కర్త సత్య సాయి, సహాయ ఇఓ లు ఆనంద కుమార్, ఆలయ అర్చకులు శ్రీనివాసా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు ప్రారంభం

## ఆర్.గోపాలకృష్ణ, ప్రాజెక్టు అధికారి ఐ.టి.డి.ఏ పాడేరు



అల్లూరిజిల్లా.(విజయభాను)పాడేరు. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు ప్రారంభించిన ఆర్.గోపాలకృష్ణ, ప్రాజెక్టు అధికారి ఐ.టి.డి.ఏ పాడేరు తన కార్యాలయంలో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు డిఎం & హెచ్ ఓ శ్రీమతి డాక్టర్ బి. సుజాత గారు చింతలవీధి ఆరోగ్య ఉప కేంద్రం లో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలే కరులతో మాట్లాడుతూ ఈ పక్షోత్సవాలను 13.06.2022 నుండి 27.06. 2022 వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా, 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని, పిల్లలు ఎక్కడ కూడా అతిసార వ్యాధితో మరణాలు సంభవించ కుండా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యమని , లక్ష్యాన్ని అమలుపరిచే ఈ క్రమంలో ప్రతి చోటా ప్రతి గ్రామంలో, సిబ్బందిని, మందులను సిద్ధంగా ఉంచామని ఆమె చెప్పారు. ప్రతి అంగన్వాడి సెంటర్, ప్రతి గ్రామం లోని రెండు సంవత్సరాల వయసు కలిగిన పిల్లల నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారి వరకు ఈ కాలంలో , ఎండల్లో ఎక్కువగా తిరగడం మూలం గా కడుపు నొప్పి, వాంతులు ,విరోచనాలుతో అతిసారం సంభవిస్తే వారికి ఓ ఆర్ స్ ను మంచి నీటిలో కలిపి సమయం సమయానికి కొద్దికొద్దిగా తాగుతూ ఉండాలని, జింక్ టాబ్లెట్స్ వేసుకోవడం మూలంగా నీరసం తగ్గి విరేచనాలు కూడా తగ్గుతుందని మనిషికి శక్తినిస్తుందని, తల్లులు పిల్లలందరికీ ఈ అతిసారం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అతిసారం రాకుండా ముందే ప్రతి పిల్లవాడికి ఓ ఆర్ ఎస్ తయారుచేసి తాగిం చాలని లేదా ప్రభు త్వం ఇస్తున్న ఓఆర్ఎస్ లను ఆశ ద్వారా తీసుకొని ప్రతి నిమిషానికి తాగిస్తూ ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంటుందని, అతిసారం తీవ్రతరంగా ఉన్నట్లయితే వెంటనే ఆస్పత్రికి తరలించాలని స్థానికంగా ఉన్న ఆశ వర్కర్, వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించడం జరిగింది. తల్లులు పిల్లల సమక్షంలో ఓ ఆర్ ఎస్ ఇంట్లో ఎలా తయారు చేసుకోవాలో తయారు చేసే విధానాన్ని డెమో చేసి చూపించడం జరిగింది. డి ఎం హెచ్ ఓ. మేడంగారు పిల్లలతో మాట్లాడుతూ ఎండలో ఎక్కువ తిరగరాదని నీడ పట్టునే ఆడుకోవాలని ఎండలో తిరిగిన పిమ్మట దాహం ఎక్కువగా వేస్తే మంచినీటిని లో ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని కలుపుకొని మాటిమాటికీ తాగుతూ ఉండాలని , కడుపు నొప్పి వచ్చిన విరేచనాలు ఎక్కువగా అవుతున్నా కన్న తల్లిదండ్రులకు, వైద్య సిబ్బందికి తెలియపరచాలని ఆమె పిల్లలకు అవగాహన కల్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో...

అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె .లీలా ప్రసాద్, డి ఐ ఓ- ప్రభావతి, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి , ఎస్ లక్ష్మణ్, సిబ్బంది శెట్టి నాగరాజు, కృష్ణ వేణి, అన్నపూర్ణ , ఆశ వర్కర్లు పాల్గొనడం జరిగింది.

# మానవ సేవే మాధవ సేవే అసోసియేషన్ ఆధ్వర్యంలో
## ఐదవ రోజు.. ఉచితంగా పిల్లలకు క్లాత్ పెయింటింగ్‌పై శిక్షణా కార్యక్రమం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మానవ సేవే మాధవ సేవే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ రోజు.. ఉచితంగా ఈ రోజు చిన్నారి పిల్లలు బాల బాలికలు.. క్లాత్ పెయింటింగ్ మొత్తం నేర్చుకోవడం జరిగింది.

8వ తేదీ నుండి 15వ తేదీ వరకు బాల బాలికలకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నాము. ప్లేస్ :- శ్రీదేవి పార్కు..మురళీనగర్., ఫోన్ : 7659804633, 9296601500. శిక్షకురాలు:-భవాని. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు

భాను ప్రకాష్ (మరియు) కార్యదర్శి:-ఎస్. సీతారామ కృష్ణ కోశాధికారి :-కె.వి.వర్మ సహాయ కార్యదర్శి:- సంతోష్ కుమార్

ఆర్గనైజింగ్ సెక్రటరీ:-వెంకటేశ్వరరావు

కార్యవర్గ సభ్యులు:- శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

# సొంత ప్రొడక్షన్ గా షికారు చిత్రాన్ని నిర్మించిన
# సాయిలక్ష్మి ఫిలింస్ అధినేత బాబ్జి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వందల చిత్రాలకు పంపిణీ దారునిగా, సినిమా హాల్లకు అధినేతగా గత మూడున్నర దశాబ్దాలుగా ఇండస్ట్రీలో పేరు సంపాదించుకున్న సాయి లక్ష్మి ఫిలింస్ అధినేత బాబ్జి తన సొంత ప్రొడక్షన్ గా షికారు చిత్రాన్ని నిర్మించారు ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా వివిధ సెంటర్లలో రిలీజ్ అవుతున్న సందర్భంలో చిత్ర యూనిట్ తో విశాఖ సిఎంఆర్ సెంటర్ లో సందడి చేశారు శ్రీ సాయి లక్ష్మీ క్రియేషన్స్ బ్యానర్ పై మొదటి చిత్రంగా నిర్మించిన 'షికారు' సాయి దర్శిక ( కబాలి ఫేమ్ ) అలాగే నటులు అభినవ్, తేజ, ధీరజ్, నవ కాంత్, చమ్మక్ చంద్ర వీరంతా విశాఖ లో తేదీ 13 6 2022 సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం లో గల సిఎంఆర్ సెంట్రల్ లో చిత్ర బృందం సందడి చేస్తూ విలేకరులతో మాట్లాడారు.

దర్శకుడు హరితో పాటు కథానాయకి, కథానాయకులు నటులు ఈ కార్యక్రమంలో పాల్గొని విశాఖ వాసులను మెప్పించారు. సీఎంఆర్ సెంటర్లో ఫ్లాష్ మాబ్ తో ఆరంభమైన ఈ చిత్ర సందడి చిత్రం నిర్మించడంలో ఎదురైన సవాళ్లను అధిగమించి కరోన అనంతర ఈ కాలంలో దీనిని రిలీజ్ చేయడం జరిగింది. కరోనా కు ముందు ప్రారంభమైన చిత్ర నిర్మాణం చివరికి విజయ పరంపర వైపు దూసుకు వెళుతుందని నిర్మాత బాబ్జి వెల్లడించారు. సహనిర్మాత పవన్ మాట్లాడుతూ విశాఖకు చెందిన తాము చిత్రాలు నిర్మించాలని గతంలోనే కోరుకున్నామని భగవంతుని దయవల్ల ప్రస్తుతం పరిస్థితులు యధాతథంగా మారడం ద్వారా చిత్ర నిర్మాణానికి పూర్తిస్థాయి వెసులుబాటు కలిగిందని ధీమా వ్యక్తం చేశారు.

# వైశాఖి జల ఉద్యానవనం లో క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో విజయవంతంగా శ్రావణ లక్ష్మి- 2022 కార్యక్రమం





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నంలో వైశాఖి జల ఉద్యానవనం లో క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణ లక్ష్మి - 2022 కార్యక్రమం విజయవంతంగా సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ శ్రీమతి గోలగాని హరి వెంకట కుమారి మరియు వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి గారు హాజరయ్యారు .ఈ సందర్భంగా శ్రావణ లక్ష్మి 2002 కార్యక్రమంలో పాల్గొన్న యువత యువతులు తెలుగునాట తెలుగుతనం ఉట్టిపడేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంలో అద్భుతంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.రమణికుమారి మాట్లాడుతూ విశాఖ నగరం కళలకు పుట్టినిల్లు అని అన్నారు మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమం చూస్తుంటే శ్రావణమాసం ముందే వచ్చినట్టు అనిపిస్తుంది అని ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు భారతీయ సంప్రదాయాలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్ ఉషా రాణి ,అక్షర కిరణం ఎడిటర్ పూజారి సత్యనారాయణ గారు,పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# హెరిటేజ్ పాడిరైతులకు ఉచిత పశు వైద్యశిబిరం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్ ) : హెరిటేజ్ పాడిరైతులకు డెయిరీ రీజనల్ మేనేజర్ పి నాగ అప్పారావు ఉచితంగా మందులు అందజేశారు. సోమవారం ఎల మంచిలి మండలం లక్కవరం గ్రామంలో హెరిటేజ్ పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేసే పాడి పశు వులకు కృత్రిమ గర్భధారణ 50 రూపాయలకు అందించబడునని తెలిపారు . అంతేకాకుండా హెరిటేజ్ పాడిరైతులకు అండగా ఉంటుందన్నారు . హెరిటేజ్ కి పాలు సరఫరా చేస్తున్న ప్రతి గ్రామములో పశువులకు కృత్రిమ గర్భధారణ అందరికీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా పాడి పశువులకు డి వార్మింగ్ చేయించారు. పాడిరైతుల అందరితో మాట్లాడి పాడిరైతులు కష్టాలను తెలుసుకున్నారు. హెరిటేజ్ డైరీ జిల్లాలో అన్ని డైరీలు కంటే ఎక్కువ రేటు చెల్లిస్తుందని అదేవిధంగా హెరిటేజ్ డైరీ కి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతు యాక్సిడెంట్ లో చనిపోతే రెండు లక్షలు, సహజ మరణానికి 50 వేలు రూపాయలు హెరిటేజ్ డైరీ కుటుంబం నామినికి అంద జేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరి ఏరియా మేనేజర్ జి గోవిందరావు, హెరిటేజ్ డెయిరీ అచ్యుతాపురం శాఖ మేనేజర్ కూండ్రపు శేషు, పాల సంఘం అధ్యక్షుడు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకుడు సర్పంచ్ డా.చింతకాయల

**- అలయ నిర్మాణానికి యాభైవేలు వితరణ - ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన కమిటీ సభ్యులు**



పరవాడ (విజయభాను న్యూస్) :ప్రేమే లక్ష్యం,సేవే మార్గం అనే చందాగా ముత్యాలమ్మపాలెం సర్పంచ్ అనకాపల్లి జిల్లా సర్పంచ్ ల సంఘం అద్యక్షులు డా"చీంతకాయల సుజాత ముత్యాలు పనిచేస్తారు అనడములో ఎటువంటి సందేహం లేదు.. పరవాడమండలం నాయుడుపాలెం,ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీపరిధిలో హనుమాన్ నగర్ రజకులు కాలనీ వద్ద నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి అనకాపల్లి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ డాక్టర్ చింతకాయల సుజాత ముత్యాలు తన వంతుగా 50,000/ యాభై వేలు రూపాయల విరాళం అందసి మానవత్వం చాటుకున్నారు .వారికి కమిటీ సభ్యులు అందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ కూండ్రపు సీతారామయ్య మరియుకమిటీ సభ్యులు లాలం అప్పలనాయుడు ,సమ్మంగి సోమేశ్వరరావు, కోరంగి అప్పలరాజు, కీలపర్తి అప్పలనాయుడు, కణితి చినసోమేష్, ఈరుగుల లక్ష్మి ప్రసాద్, సమ్మంగి అప్పారావు, పిడిమి తాతబాబు, పైడిరాజు, ఈరుగుల శ్రీను తదుపరి సభ్యులు పాల్గొన్నారు.

# పంచకర్లను కలిసిన పరవాడ వైసీపీ శ్రేణులు



పరవాడ (విజయభాను న్యూస్): పెందుర్తి మాజీ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబును సోమవారం అయన జన్మదినం సందర్భంగా పరవాడ వైసిపి శ్రేణులు రెడ్డిశ్రీనువాసురావు, రాజానసత్యం, బొద్దపు అయ్య బాబు, వర్రిహరి తథితర్లు పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరము అయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు. పంచకర్ల రమేష్ బాబు ఇటువంటి జన్మదిన వేడుకు మరిన్నీ జరిపికోవాలానీ పలువురు అకాక్షించారు. ఈ కార్యక్రమంలో పైలసురేష్ ,రెడ్డి చిన్నా తథితర్లు పాల్గోన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పంచకర్లకు శుభాకాంక్షలు తెలిపిన గొన్నా



పరవాడ (విజయభాను న్యూస్) : పెందుర్తి మాజీశాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబును గొన్నా కాలేజి అధినేత గోన్నాహేమచంద్ నాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా పంచకర్లకు గొన్నాహేమచంద్ నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు.అయన ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరిపికోవాలానీ అకాక్షించారు.ఈకార్యక్రమంలో అభిమానులు తథితర్లు పాల్గోన్నారు.

# మల్లునాయుడు పాలెంలో గడప గడప కు ప్రభుత్వం



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయంలో గ్రామ నేతలు, మండల నేతల తో రివ్యూ నిర్వహించి ముందుగా సమస్యలను, పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. గ్రామ పుర వీధుల్లో ఎమ్మెల్యే అదీప్ రాజ్ పర్యటించి ప్రజల నుండి సమస్యల పై వచ్చిన వినతులను స్వీకరించారు. గ్రామంలో డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయినా, ఇంకా పనులు ప్రారంభించలేదని అడిగి తెలుసుకున్నారు. అలాగే వైయస్సార్ ఇళ్ళకీ కొంతమంది లబ్ధిదారులు మిగిలి ఉన్నారని, వారికీ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా, సంబంధిత అధికారులను దరఖాస్తులు లబ్దిదారులనుండి తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, సర్పంచ్ బోను దేముడమ్మ, గంగునాయుడు, ఎంపీటీసీ గొర్లి కనక రాజు, వీర్వోల జిల్లా సంఘ అధ్యక్షులు ఎస్. టి. రామకాసు, ఎంపీడీఓ రమేష్ నాయుడు, తహసీల్దార్ రమాదేవి, పలుశాఖల అధికారులు, వైసీపీ నేతలు కోటాన రాము,కర్రి బాబు, యడ్ల నాయుడు, బండారు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# పరవాడలో సర్వసభ్య సమావేశం ప్రశాంతం




పరవాడ (విజయభాను న్యూస్) : ఎమ్ పిడిఒ కార్యలయంలో ఏమ్ పిడిఒ హేమసుంధర్ రావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశం సోమవారం ప్రసంతంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మి శ్రినివాస్ ,జడ్పిటిసి పియస్ రాజు హజరైన్నారు. ముందుగా వ్యవసాయ అదికారణి చంద్రావతి మాట్లడుతూ ఖరీఫ్ సీజనలో రైతులుకు సర్కార్ అందిస్తున్న పధకాలు అన్ని సద్వినియోగం చేసుకోవాలానీ కోరారు.వైద్యాదికారులు మాట్లడుతూ కరోనా కేసులు మరల పెరుగుతుండటముతో ప్రతి ఒక్కరు పలుసూచీనలుపాటించాలానీ కొరారు. పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు మాట్లడుతూ పరవాడ జెఎన్ అర్ ఎమ్ కాలనీకి బర్రెలగ్రౌండ్ కేటాయించాలానీ రెవిన్యూఅదికారులును కోరారు.మండలవిద్యాశాఖాఅదికారిణి సునీత మాట్లడుతూ మండలములో 67గవర్నమెంట్ స్కూల్స్ మరియు 29ప్రైవేట్ స్కూల్స్ ఉన్నాయి అన్నారు.వీరికి ప్రతిఏటా జగన్అన్న గోరుముద్ధ,జగనన్న అమ్మఒడి అందితున్నాయి అన్నారు.ఈ కార్యక్రమంలో మండలములో గల సర్పంచ్ లు,ఎంపిటిసి వివిధశాఖల అదికారులు తథితర్లు పాల్గోన్నారు.

# పి.బోనంగిలో వైస్ సర్పంచ్ గొంతిన అధ్యక్షతన కొలాటం ప్రారంభం



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం పి. బోనంగి గ్రామం లో (చిరతలు, కర్రసాములు, తోలేలు,గరిడి, తప్పేటుగుళ్ళు, భజనలు)ఇవే కాకుండా ప్రస్తుత కాలంలో అందరిని అలరిస్తున్న కోలాటాన్ని పి.బోనంగీ వైస్ సర్పంచ్ గొంతినరాము అధ్యక్షతన శ్రీ సీతా రామాంజనేయ చిన్న పిల్లల కోలాటం బృందం వారిచే శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవాలయం (పి.బోనంగి)దగ్గర స్వామి వారి ఆశీస్సులతో మొదటి సారి కోలాటం ప్రారంభించారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ బండారు రాజశేఖర్, డెక్కశ్రీను మరియు (గ్రామ పెద్దలు , గ్రామ పురజనులు తథితర్లు పాల్గోన్నారు.

# ఈ నెల 19న ఫాథర్స్ డే – పెద్ద ఎత్తున ఈవెంట్

**- ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరించిన జివియంసి కమిషనర్ లక్ష్మీశా**



విశాఖపట్నం (విజయభాను న్యూస్): అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా జూన్ 19న ఆంధ్ర యూనివర్సిటీ వైజాగ్ ఎక్స్పో ప్రాంగణం లో "మై డాడ్ " పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్న వీరుమామ ను లక్ష్మి షా అభినందించారు. ఇలాంటి ఈవెంట్స్ వలన సమాజం లో మంచి పెరుగుంతుందని, అలాగే ప్లాస్టిక్ రహిత సమాజం కోసం గ్రీన్ ప్లెడ్జి పేరిట కూడా చేస్తున్న కార్యక్రమం అభినందనీయం అన్నారు. వీరుమామ మాట్లడుతూ జూన్ 19న నాన్నతో నడక, సూపర్ ఫిట్ డాడ్, గేమ్ షో, డీజే డాన్స్ విత్ డాడ్ వంటి వినూత్న కార్యక్రమాలు ఉంటాయని, ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా ఈ కార్యక్రమం లో పాల్గొనొచ్చని, తండ్రులు మరియు పిల్లలకు ఒక మధురానుభూతీ మిగిల్చడమే ఉద్దేశము అని తెలిపారు. పాల్గొనాలి అనుకునే వారు 9912999949 లో ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవొచ్చని తెలిపారు.


# పురపాలక పాఠశాలలను విద్య శాఖలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది

**ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు**

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పురపాలక పాఠశాలలను విద్య శాఖలో విలీనం చెయ్యడం వల్ల విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అభిప్రాయపడ్డారు సోమవారం విశాఖ పౌరగ్రంధాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సులో పలువురు నాయకులు పాల్గొని పురపాలిక విద్యావ్యవస్థను ఐకమత్యంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీ.వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పురపాలిక పాఠశాలలు, ఆస్తులు విద్యాశాఖ కు స్వాధీనపరచాలని నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పురపాలిక సంస్థల్లో పురపాలిక విద్య అనేది ఒక భాగమని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు.ఇలా వేరుచేయడం 74 వ ఆర్టికల్ కు విరుద్ధమని,స్థానిక సంస్థల స్వతంత్రతకు భంగం కలుగుతుందన్నారు.పురపాలికల్లో విద్య వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ శాఖలో విద్యాధికారుల పోస్టులు మంజూరు చెయ్యాలని కోరారు.ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీ డీ ఓ అధికారాలు ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కల్పించే అన్ని సౌకర్యాలు జీ పీ ఎఫ్,ఎల్ టీ సి తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో పాల్గొన్న వక్తలు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.ఈ సమావేశంలో అల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు,ఏ పీ హెచ్ ఎమ్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ వీ నారాయణ రెడ్డి,ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పీ.రఘువర్మ,ఎఫ్ ఓ ఆర్ టీ ఓ గౌరవ సలహాదారు ఒంటేరు శ్రీనివాస రెడ్డి,ఏ ప్ జె ఏ సి రాష్ట్ర నాయకుడు నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోచుకున్న లక్షల కోట్లు విదేశాల్లో మూలుగుతున్నా బాబుకు మాత్రం సుఖ నిద్ర కరువైంది

- బాబు లాజిక్ లకు ఫ్యూజులు ఎగిరిపోతున్నాయ్
- పీడకలలతో వణికిపోతున్న లోకేష్
- ప్రజల వద్దకు వెళ్తే నర్సాపురం నక్క అసలు రంగు బయటపడేది
- ట్విట్టర్ వేదికగా ఎంపీ విజయసాయి రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దోచుకున్న లక్షల కోట్లు దేశ విదేశాల్లో మూలుగుతున్నా టకోరా బాబు (చంద్రబాబు)కు సుఖనిద్ర కరువయ్యిందని, ప్రపంచంలోని ధైన్యమంతా బాబు ముఖంలోనే తాండవిస్తోందని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలపై స్పందించారు. బాబు.... "పులి, బ్రూస్లీ, తోపు" అని జాకీలతో నిలబెట్టడానికి కుల మీడియా ఇచ్చే బూస్టర్ స్టెరాయిడ్లు కూడా పనిచేయడం లేదని అన్నారు. బాబు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ కెళ్ళి రైతుల భూములతో వ్యాపారం చేస్తే అతనో పెద్ద విజనరీ రామోజీ ఫిలిం సిటీలో క్యాబరే డాన్సులు పెట్టి మద్యం పారిస్తే అది ఆధునికతకు చిహ్నం, చెత్త మద్యం బ్రాండ్స్ అన్నీ చంద్రం హయాంలో వచ్చినవేనని ఆయన లాజిక్ కి జనం బెంబేలెత్తిపోతున్నారని ఏద్దేవా చేశారు. టెన్త్ పిల్లలకు బ్రెయిన్ వాష్ చేసి పేలాలు ఏరుకుందామన్న ఆశతో జూమ్ మీటింగ్ పెట్టి మధ్యలో పారిపోయిన పప్పునాయుడు లోకేష్ పీడకలలతో వణికిపోతున్నాడుని అన్నారు. జూమ్ యాప్ సీఈవో ఎరిక్ యాన్ కు ఫోన్ కలపమంటున్నాడు. చైనీయుల కుట్ర ఉందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. మొత్తంగా యాప్ లోపాలను ఏకరువు పెడుతున్నాడని ఏద్దేవా చేసారు. చిట్టి నాయుడు (లోకేష్)కు తన భవిష్యత్తు శూన్యమనే బెంగతో ముద్ద మింగుడు పడక చిక్కిపోతున్నాడని,చక్రాలు తిప్పాడనుకున్న తండ్రి కూర్చుని లేవలేకపోతుంటే, తన గతి ఏమిటని కుమిలిపోతున్నాడని, జూమ్ సెట్టింగ్ తీసేయించినా కలవరింతలు మాత్రం పోవడం లేదని అన్నారు. పట్టపగలే తప్పతాగి మధ్యాహ్నం ఒంటి గంటకు నాలుగు పచ్చ కుల మీడియా మైకుల ముందు మత్తు దిగేదాకా మొరగడం విగ్గు/ పెగ్గు రాజా పని అని, ఒకసారి నియోజకవర్గంలో ఓట్లు వేసిన వారి దగ్గరకు వెళ్తే నర్సాపురం నక్క అసలు రంగు బయటపడుతుందని. 'నీలి రంగు నక్క గతే పడుతుందని నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజుపై మండిపడ్డారు. ఎల్లప్పుడూ గంజాయి మత్తులో ఉండే ఫుల్ బాటిల్ పాత్రుడు (అయ్యన్నపాత్రుడు) టీడీపీని ఫినిష్ చేయాలని కంకణం కట్టుకుని బొల్లి నాయుడు చిటికెల కోసం ఎదురు చూస్తున్నాడని మండిపడ్డారు.భవిష్యత్తులో ప్రజల దగ్గరకు ఎలా వెళ్లాలనే భయం ఉంటే కదా పద్ధతి పాడు అని ఆలోచించేదని ఆగ్రహం వ్యక్తం చేసారు.

## సీఎం జగన్‌ను కలిసిన సివిల్స్ సర్వీసెస్ విజేతలు



అమరావతి (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ నుంచి సివిల్ సర్వీసెస్-2021కి ఎంపికైన విజేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు వాళ్లు. ఏపీ నుంచి సివిల్ సర్వీసులకు ఎంపికైన ఆ అభ్యర్థులతో ముచ్చటించి, పేరుపేరునా వారిని అభినందించారు సీఎం జగన్. ఈసారి సివిల్స్ విజేతల్లో.. నంద్యాలకు చెందిన యశ్వంత్ రెడ్డికి 15వ ర్యాంకు లభించడం విశేషం. విశాఖకు చెందిన పూసపాటి సాహిత్యకు 24వ ర్యాంకు, నర్సీపట్నంకు చెందిన మౌర్య భరద్వాజ్ కు 28, కాకినాడ అమ్మాయి కొప్పిశెట్టి కిరణ్మయికి 56, భీమవరంకు చెందిన శ్రీపూజకు 62వ ర్యాంకు, విజయవాడకు చెందిన గడ్డం సుధీర్ కుమార్ రెడ్డికి 69వ ర్యాంకు, నగరికి చెందిన మాలెంపాటి నారాయణ అమిత్ కు 70, రాజమండ్రికి చెందిన తరుణ్ పట్నాయక్ కు 99వ ర్యాంకు వచ్చాయి.

## ప్లాస్టిక్ నిషేధానికి ఎన్.జి.ఓ ల సహకారం ప్రశంసనీయం

- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్లాస్టిక్ నిషేధానికి ఎన్.జి.ఓ'లు చేస్తున్న సహకారం అభినందించ దగినదని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మిరాకల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వంతన సేవా సమితి సంయుక్త ప్లాస్టిక్ నియంత్రణ కొరకు రూ.3.50 లక్షలతో ప్రచారం కొరకు మొబైల్ వ్యాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి జివిఎంసి చేస్తున్న కృషికి ఎన్.జి.ఓలు మంచి సహకారం అందిస్తున్నారని, వారందరికి కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. మిరాకల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వంతన సేవా సమితి ప్లాస్టిక్ నిషేధం కొరకు ప్రచార వ్యానును సమకూర్చారని, ఇప్పటి నుండి ఆగస్టు - 15వ తేదీ వరకు ఆర్.కె. బీచ్, జగదాంబ జంక్షన్, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాలలో ప్రతి శని, ఆదివారాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం కొరకు ఇప్పటికే ప్రజలలో అవగాహన వుందని, ప్రజలు ప్లాస్టిక్ బదులు మెల్లగా గుడ్డ, నార సంచులవైపు మల్లుతున్నారని తెలిపారు. ఇంకా అక్కడక్కడ ప్లాస్టిక్ కనిపిస్తుందని, పూర్తిగా నిషేధిత ప్లాస్టిక్ ను దుకాణాలు, వినియోగదారులు వాడరాదని కమిషనర్ తెలిపారు.

మిరాకల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వంతన సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఎప్పటినుండో మా వంతు ప్రయత్నం చేస్తున్నామని, అందుకు జివిఎంసి కమిషనర్ సహకారం వుందని, ఇంకా విస్తృతంగా ప్లాస్టిక్ నిషేధం పై ప్రజలలో అవగాహన కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో మిరాకల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జేమ్స్ శంసాని, స్వంతన సేవా సమితి ప్రతినిధి ప్రజ్ఞాన కుమార్, జివిఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కంటే ప్రమాదం కల్తీ మద్యం

- మద్యపానం నిషేధం ఎప్పుడు - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం: రాష్ట్రంలో ఉండే ప్రతీ ఆడపడుచుకు ప్రమాణం చేసి చెబుతున్నా.వైసిపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యపానం నిషేధం అమలు చేస్తారు అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా ఎందుకు మద్యపాన నిషేధం అమలు చేయలేదని టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.స్థానిక టి డి పి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గంటా నూకరాజు మాట్లా డు తూ వైసిపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో వాడుకలో ఉండే మద్యం బ్రాండ్లను కాదని కొత్త బ్రాండ్లను తెచ్చి మూడురెట్లు అధికంగా ధరలు పెంచారని అన్నారు. మద్యం షాపులో చీఫ్ లిక్కర్ అమ్మడమే కాకుండా ఎక్కడబడితే అక్కడ నాటుసారా, గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా లభ్యమవుతున్నా దానికి కారకులైన వారిపై ఎందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని గంటా నూకరాజు ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసలుగా అవుతున్నా ఎందుకు ప్రభుత్వం వాటిని నిరోదించడంలో వెనుకడుగు వేస్తుందని అడిగారు. అదేవిదంగా ప్లాస్టిక్ వినియోగం కంటే కల్తీ మద్యం, మత్తు పదార్థాలు ఇంకా ప్రమాదమని గంటా నూకరాజు అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై తీసుకున్న చర్యలు శుభపరిణామమని చిరు వ్యాపారులు, షాపుల యజమానులకు ప్లాస్టిక్ వాడకూడదు అని చెప్పడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు తయారు చేస్తున్న కంపెనీలను మూసివేయిస్తే వందశాతం విజయం సాధిస్తామని ఆ కోవలో ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా మద్యం కూడా నిషేదించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెడుగుడు ఆడుతున్న మద్యం మహమ్మారి నుండి రాష్ట్రాన్ని కాపాడాలని, పాదయాత్రలో ఇచ్చిన మద్యపానం నిషేధం హామీని నెరవేర్చాలని గంటా నూకరాజు అన్నారు.

### షిర్డీ సాయిబాబా ఆలయం 3 వ వార్సికోత్సవం

ఆనందపురం : అనందపురం మండలం,గొట్టిపల్లి గ్రామంలో ఆలయకమిటి అధ్యక్షులు బంటుపల్లి మణిశంకరనాయడు ఆద్వర్యంలో షిర్డీ సాయిబాబా ఆలయం 3 వ వార్సికోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిపించారు.మధ్యాహ్నం అన్నసమారాధన (ప్రసాదం వితరణ) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుండి గ్రామ పురవీదుల్లో స్వామి వారిని ఊరేగించారు . ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఎ చైర్మన్ గాడు. వెంకటప్పడు, జీ.ఎల్లయ్య ,మజ్జి వెంకటరావు,గాడు వెంకట నారాయణ, గాడు తాతినాయడు , నీలాపు సూర్యనారాయణ, ఆలయ కమిటి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకూ తప్పనిసరిగా వెళ్లాలి

- ప్రతి ఇంటికి సీఎం వైయస్ జగన్ రాసిన లేఖ అందించాలి
- మన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి
- ప్రతి ఇంటి నుంచి మిస్‌డ్ కాల్ ఇప్పించాలి
- ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో బూత్ కమిటీలు ఏర్పాటు చేయండి
- వైయస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి

అమరావతి(విజయభాను న్యూస్) : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లాలని వైయస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి సూచించారు. సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, వ్యక్తిగత సహాయకులకు మరింత అవగాహన కల్పించేందుకు సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం ఎలా నిర్వహించాలి. ప్రతి ఇంటికి వెళ్లిన సమయంలో ఎలా వ్యవహరించాలి అన్న అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ రోజు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించాం. వర్క్‌షాప్‌లో ఇటీవల సీఎం వైయస్ జగన్ గడపగడపకు మన ప్రభుత్వంపై దిశా నిర్దేశం చేశారు. సీఎం ఆదేశాల మేరకు నెలలో 20 రోజులు ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో గడప గడపకు వెళ్లాలి. నెలలో రోజుల్లో 20 రోజులు ఈ కార్యక్రమాన్ని చేస్తే.. పది సచివాలయాలను సందర్శించవచ్చు.

మే 11వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఏ కార్యక్రమంలోనై ఒడిదుడుకులు ఉంటాయి. జూన్ మాసం నుంచి చాలా సీరియస్‌గా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి ఎమ్మెల్యే కృషి చేయాలి. ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఎన్ని గ్రామాల్లో పర్యటించారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా నెలకు 10 సచివాలయాలను సందర్శిస్తే



నియోజకవర్గం పూర్తి చేసేందుకు 8 నెలల సమయం పడుతుంది.

మన ప్రభుత్వం ఏం చేస్తున్నది ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఎమ్మెల్యేలందరూ కూడా ఈ కార్యక్రమాన్ని ఎలా చేస్తున్నారు. ఎంత వరకు చేశారన్నది మీ అనుభవాలను పంచుకోవాలి. ప్రతి ఇంటికి వెళ్లాలి. ఏ ఒక్కరి ఇంటిని కూడా మనం నిర్లక్ష్యం చేయకూడదు. అన్ని ఇళ్లను కవర్ చేయాలి. ఒక్కో ఇంట్లో ఎంత సమయం కేటాయిస్తున్నారన్ని ఇంపార్టెంట్.

మీకు మూడు బుక్ లెట్ ఇచ్చారు. సీఎం వైయస్ జగన్ లబ్ధిదారులకు రాసిన లేఖ, మేనిఫెస్టో బుక్‌లెట్, ఈ మూడేళ్లలో ఏ పథకాలు అమలు చేశామన్నది ఈ బుక్‌లెట్‌లో పొందుపరిచాం. ఎంత టైం కేటాయిస్తున్నారని ముఖ్యమైన అంశం.

మే 11 నుంచి ఈ రోజు వరకు ఎన్ని గ్రామ సచివాలయాలను కవర్ చేశామన్నది గమనించాలి. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు దాదాపు ఏడాది పడుతుంది. కాబట్టి సమయం చాలా విలువైనది. త్వరగా ప్రతి ఇంటిని సందర్శించాలి. కొందరు ఒక్క రోజులోనే ఒక సచివాలయాన్ని కవర్ చేస్తున్నారు. చాలా జాగ్రత్తగా ఈ కార్యక్రమాన్ని చేయాలి. ప్రతి లబ్ధిదారుడిని కన్వీన్స్ చేసి వారితో పార్టీకేంద్ర కార్యాలయానికి మిస్స్‌డ్ కాల్ చేయించాలి. అప్పుడే అతన్ని సభ్యుడిగా పరిగణిస్తాం. మిస్‌డ్ కాల్ తప్పనిసరిగా ఇప్పించాలి. కొన్ని కొన్ని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు వాలంటీర్ల ద్వారా ఇళ్లకు బుక్‌లెట్లు పంపిస్తున్నారట. అలాంటివి జరగకూడదు. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. అప్పుడే పార్టీ అధికారంలోకి వస్తుంది. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో ఎక్కువ సమయం కేటాయించాలి. మూడు బ్రోచర్స్ లబ్ధిదారులకు అందజేయాలి. ప్రతి ఇంట్లో అందరూ కూడా మనకు అనుకూలంగా ఉంటారని అనుకోకూడదు. న్యూట్రల్ ఓటర్లను మనవైపు ఆకర్షించేలా వారిని ఒప్పించి మిస్‌డ్ కాల్ ఇప్పించాలి. గ్రామ సచివాలయం పరిధిలో బూత్ కమిటీలను ఎమ్మెల్యే ఎంపిక చేయాలి. అప్పుడే ఓటర్లను బూత్ కమిటీలు బూత్ వద్దకు తీసుకువస్తారు. ఎవరు మనకు పూర్తి నమ్మకంగా, నిష్పక్షపాతంగా ఉంటారో గమనించి బూత్ కమిటీలో ఎంపిక చేయాలి. గ్రామ కమిటీలకు, బూత్ కమిటీలను సమన్వయం చేయాలి. మండల కమిటీలు, గ్రామ కమిటీలు ముందుగానే నియమించాలి. ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర కీలకమని ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు.

# నేడే భారత్ సౌత్ ఆఫ్రికాల సమరం



మధురవాడ (విజయభాను న్యూస్) : భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య నేటి సాయంత్రం జరగనున్న 3 వ టి -20 మ్యాచ్ కి పి ఎం పాలెం ఏసీఏ- విడిసిఎ క్రికెట్ స్టేడియం సర్వం సిద్ధమైంది.

స్టేడియం లోపల 730 మంది లా అండ్ ఆర్డర్ పోలీసులను,స్టేడియం బయట 500 మంది ట్రాఫిక్ పోలీసుల సిబ్బందినీ, ఇతర తనిఖీ విభాగాలు కలుపుకొని మొత్తం 1430 మంది పోలీసులతో కట్టు దిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని అధికారులు పేర్కొన్నారు. ప్రేక్షకులు స్టేడియంలోనికి ప్రవేశించేందుకు గాను స్టేడియం చుట్టూ 20 గేట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు మొదలై రాత్రి 11:30 గంటల వరకు జరుగుతుందని అన్నారు. 27 వెలు మంది సామర్థ్యం కలిగిన స్టేడియం లో ప్రేక్షకులకు కావలసిన సౌకర్యాలు కల్పించమని అన్నారు. ఇదిలా ఉండగా స్టేడియం లోపలికి ఏటువంటి తినుబండారాలు, వాటర్ బాటిల్స్, జెండాకర్రాలను అనుమతించేది లేదని పోలీసులు స్పష్టంచేశారు. ఇరు జట్లు సోమవారం సాయంత్రానికి నగరానికి చేరుకున్నాయి.నగరంలో ఎప్పుడు క్రికెట్ జరిగిన క్రీడాకారులకు నోవేటెల్లో అతిద్యం అందించేవారు. క్రీడాకారులు పి ఎం పాలెం స్టేడియం కి చేరుకునే సమయం లో ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడుతున్న కారణంగా వాటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఈ సారి ఇరు జట్ల కి రుషికొండ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న రాడిసన్ హెూటల్స్ లో ఇరు జట్ల కి వసతి ఏర్పాట్లు చేశారు.

**సమరానికి సై...**

ఇండియా - సౌత్ ఆఫ్రికా టి -20 అయిదు సీరీస్ మ్యాచ్లో భాగంగా ఇప్పటికే రెండు మ్యాచ్లను సౌత్ ఆఫ్రికా కైవసం చేసుకుంది. మంగళవారం నాడు విశాఖ లో జరిగే మ్యాచ్ ను భారత్ కైవసం చేసుకొని సీరీస్ చేజిక్కిన్చుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

గతంలో విశాఖలో జరిగిన మ్యాచ్లో టీమ్ ఇండియా గెలిచిన సందర్భాలు ఉన్నాయి కనుక ఈ మ్యాచ్ నీ కైవసం చేసుకునేందుకు ఎదురు చూస్తోంది.

పైగా సౌత్ ఆఫ్రికా జట్టు విశాఖ స్టేడియంలో ఇదే మొదటి సారి ఆడుతోంది. పైగా పి ఎం పాలెం స్టేడియం బ్యాటింగ్ పిచ్ కావడంతో టీమ్ ఇండియా ఈ మ్యాచ్ లో గెలిచి అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# గీతం అంతర్జాతీయ చెస్‌పోటీలు

## ఆధిక్యంలో భారత క్రీడాకారులు




సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫైడ్) మరియు అఖిల భారత చదరంగ సమాఖ్య పర్యవేక్షణలో ఆంధ్ర చదరంగ సంఘం వారం రోజుల పాటు నిర్వహిస్తున్న గీతం యూనివర్సిటీ 3వ వైజాగ్ గ్రాండ్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్-2022 పోటీలలో సోమవారం తేది:13-06-2022న భారత క్రీడాకారుల ఆధిపత్యం కొనసాగింది. సోమవారం జరిగిన పోటీలలో ''ఎ'' కేటగిరి విభాగంలో 5వ రౌండ్ పూర్తిఅయ్యేసరికి 5గురు క్రీడాకారులు 4.5/ 5 పాయింట్ల ఆధిపత్యంతో కొనసాగుతున్నారని ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు తెలిపారు. వీరిలో ఇద్దరు భారత క్రీడాకారులు కె.పొన్ను స్వామి (భారత 2299 ర్యాంకింగ్ క్రీడాకారుడు), ఎ.అమేయ (భారత 2395 ర్యాంకింగ్ క్రీడాకారుడు) ఉన్నారని తెలిపారు. గత రెండు రోజులుగా అద్భుత ప్రతిభ చాటిన విశాఖ యువ క్రీడాకారుడు జి.ఆధిత్య వరుణ్ 3.5/5 పాయింట్లతో నిలిచాడు.

''బి''కేటగిరి విభాగంలో 6వ రౌండ్ పూర్తిఅయ్యేసరికి పాండిచ్చేరి క్రీడాకారుడు ఉమాశంకర్ (భారత 1873 ర్యాంకింగ్ క్రీడాకారుడు) ప్రతిభను చాటి 6/ 6 పాయింట్ల ఆధిక్యంతో అగ్ర స్థానంలో నిలవగా మరో 5గురు క్రీడాకారులు 5.5/ 6 పాయింట్ల ఆధిపత్యంతో కొనసాగుతున్నారని కార్యదర్శి తెలిపారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజమండ్రి క్రీడాకారుడు కె.మహేష్ కుమార్ (భారత 1882 ర్యాంకింగ్ క్రీడాకారుడు) ఉన్నారని పేర్కొన్నారు.

# అల్లూరి జిల్లాలో ప్రైవేటు బస్సు బోల్తా.. ఐదుగురి మృతి

చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి వద్ద సంగీత ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. ఘటనాస్థలంలో ముగ్గురు.. భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో ఇద్దరు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో ముగ్గురు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒడిశాలోని చిన్నపల్లి నుంచి విజయవాడకు వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ధనేశ్వర్ దళపతి(24), జీతు హరిజన్(5), సునేనా హరిజన్(2)తో పాటు మరో ఇద్దరు ఉన్నారు. వీరంతా ఒడిశా వాసులుగా గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బస్సు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



సచివాలయాలను తనిఖీలు నిర్వహించాలని జి.ఎస్.డబ్ల్యు.ఎస్., కో-ఆర్డినేటర్ ను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న జగనన్న తోడు వంటి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించే విషయం లో అలసత్వం వలదని అధికారులను ఆదేశించారు. విద్యుత్ మీటర్ల ఆధార్ సీడింగ్ వెంటనే పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఎక్కడ ఖాళీలు ఉండకూడదని ఎం.పి.డి.ఓ లకు ఆదేశించారు.

తదుపరి జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమం లో 190 విజ్ఞప్తులు అందాయి. IDCF (Intensified Diarrhoea Control Fortnight) పోస్టర్ ఆవిష్కరణ : DCF (Diarrhoea Control Fortnight) జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశం ఈరోజు విశాఖపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అధ్యక్షతన జరిగింది. ఇందులో భాగంగా ఆయన IDCF పోస్టర్ ను ఆవిష్కరించారు. డిఎమ్‌బీహెచ్ఓ., డా.కె.విజయలక్ష్మి కార్యక్రమం గురించి వివరించి, లైన్ డిపార్ట్మెంట్ శాఖల అధికారులు ఈ కార్యక్రమం అమలుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ నెల జూన్ 13 నుండి 27 వరకు నిర్వహించనున్న IDCF ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ సభ్యులందరికీ కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. ఎస్.విశ్వనాధన్, ఎస్.డి. సి రంగయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలి

**- ఈ ఓ సూర్యకళ**




సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు రుచి కరమైన ప్రసాదాలు భోజనాలు అందించాలని ఇఓ ఎంవి సూర్య కళ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె అన్నదానం భవనం, అలాగే ప్రసాదాల తయారీ పై విభాగాలను పరిశీలించారు. ప్రసాదాల నాణ్యత తనిఖీ చేశారు. ప్రసాదాల కొరత రాకుండా చూడాలని మందలించారు శనివారం సాయంత్రం వరకూ పులిహెూర అందుబాటులో వుండాల్సిందే అంటూ సహాయ ఈఓ, పర్యవేక్షకులుకు ఆదేశాలు జారీ చేశారు.అలాగే అన్నదానం భవనం లో ఉద్యోగులందరితో సమీక్ష నిర్వహించారు.స్థానిక సమస్యల పై ఆరా తీశారు.ప్రధానంగా యాత్రికుల ఆకలి తీర్చటం లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. సిబ్బంది చిత్త శుద్ధితో పనిచేయాలని ఆమె కోరారు. శనివారం వంటి యాత్రికుల రద్దీ రోజుల్లో సాయంత్రం దాకా పులిహెూర అందించాలి అన్నారు. సహాయ ఇఓ లు ఆనంద కుమార్, తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు శ్రీను, పాలూరి నరసింగరావు , అన్నదాన, ప్రసాదాల వంట స్వాములు పాల్గొన్నారు.



# “స్పందన” కార్యక్రమం నిర్వహించిన నగర మేయర్



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో పాత సమావేశ మందిరం వద్ద ''స్పందన'' కార్యక్రమంను ఉదయం 11.00 గంటల నుండి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నిర్వహించారు. తదుపరి జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తమ ఛాంబర్లో01.00 గంట వరకు నిర్వహించారు. ''స్పందన'' కార్యక్రమంలో స్వీకరించిన 73 ఫిర్యాదులు: ''స్పందన'' కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా స్వీకరించిన ఫిర్యాదులు ఒకటవ జోనుకు 03, రెండవ జోనుకు 15, మూడవ జోనుకు 12, నాలుగవ జోనుకు 06, అయిదవ జోనుకు 16, ఆరవ జోనుకు 07, ఎనిమిదవ జోనుకు 08, మెయిన్ ఆఫీసునకు 06, మొత్తము 73 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో పరిపాలనా విభాగానికి 06, రెవెన్యూ 03, ప్రజారోగ్యానికి 07, టౌన్ ప్లానింగ్ కు 36, ఇంజనీరింగ్ కు 11, యుసిడికి 10, ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఈ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్, కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎ. వి. రమణి, సిసిపి ఎ. ప్రభాకర రావు, సిఎంఒహెచ్ డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, ఎఫ్.ఎ.బీఎ.ఒ. మల్లికాంబ, ఎ.డి.(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, డి.సి.(రెవెన్యూ) పి. నల్లనయ్య, డి.పి.ఓ.లు ఫణిరాం, చంద్రిక, విజయ లక్ష్మి, ఎసిపి వెంకటేశ్వర రావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్ రెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్లు శివ ప్రసాద్ రాజు, శ్యాంసన్ రాజు, వేణుగోపాల్, గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com